బోధన.. విద్యార్థుల వేదన


ధర్మవరంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు


కదిరి మున్సిపల్ ఉర్దూ మెయిన్ స్కూల్‌లో ఉపాధ్యాయుల కొరతతో ఖాళీగా ఉన్న విద్యార్థులు

• పేద విద్యార్థుల చదువులపై కనిపించని సర్కారు శ్రద్ధ

పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విధంగా ప్రభుత్వ విద్యారంగంలో గత జగన్ సర్కార్ సంస్కరణలు తీసుకొచ్చింది. విద్యార్థుల సంఖ్యకు తగినట్టు తరగతి గదులు కేటాయించి.. మౌలిక సదుపాయాలు మెరుగుపరచి బోధన పటిష్టపరిచారు. డిజిటల్ బోధన.. ఆంగ్ల మాధ్యమంలో తరగతుల నిర్వహణ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అత్యున్నత శిఖరాలకు చేరుకునేలా తీర్చిదిద్దాలని భావించారు. ఈ సత్సంకల్పాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగించడంలో వెనుకబడింది. పేద విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేయడంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.

ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల వివరాలు..

నియోజకవర్గం	ప్రభుత్వ పాఠశాలలు	పని చేస్తున్న ఉపాధ్యాయులు	ఖాళీలు
ధర్మవరం	238	864	268
పుట్టపర్తి	312	1,103	51
కదిరి	416	1,368	70

ధర్మవరం: నియోజకవర్గంలోని ధర్మవరం, తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 238 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో జగన్ సర్కారు మౌలిక సదుపాయాల కల్పన, ఫర్నీచర్, విద్యుత్, అదనపు తరగతి గదులు, ఆకర్షణీయమైన రంగులు, తాగునీటి సౌకర్యం కల్పించి ఎంతో అందంగా తీర్చిదిద్దింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యారంగంపై శీతకన్నేసింది. నియోజకవర్గంలో మొత్తం 864 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఇంకా 268 దాకా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయుల కొరత కారణంగా బోధన ముందుకు సాగడం లేదు. ఒక పక్క త్రైమాసిక పరీక్షలకు సమయం సమీపించినా సిలబస్ కాకపోవడంతో విద్యార్థులు వెనుకబడుతున్నారు. ఇక మధ్యాహ్న భోజనం సైతం కూటమి ప్రభుత్వం అధికార పార్టీ కార్యకర్తలకు నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పారు. మునుపటిలా మెనూ పాటించకుండా.. వారికి నచ్చినట్టు భోజనం పెడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇక గత ప్రభుత్వ హయాంలోనే విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రి (స్టూడెంట్ కిట్స్) సమకూర్చడంతో ఇబ్బంది లేకుండా పంపిణీ చేశారు. కొన్ని పాఠశాలల్లో తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కుంటుపడిన బోధన..

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యాబోధన కుంటుపడుతోంది. పుట్టపర్తి నియోజకవర్గంలో 302 పాఠశాలలున్నాయి. ఇందులో 1,103 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా దాదాపు 51 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ ఉండటంతో షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ కూడా చేపట్టడం లేదు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలను మార్చడంతో విద్యార్థులకు కొన్నిచోట్ల సక్రమంగా భోజనం అందని పరిస్థితి నెలకొంది. గతంలో వైఎస్ జగన్ సర్కార్ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మార్చేసింది. విద్యార్థులకు విద్యాసామగ్రితో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేవారు. 8వ తరగతి చదివే విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్స్ ఇవ్వడంతో పాటు బైజూస్ కంటెంట్‌ను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం నియోజకవర్గవ్యాప్తంగా 18,549 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు.

■ **పట్టించుకోని ప్రభుత్వం**

కదిరి అర్బన్: విద్యారంగ సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కదిరి నియోజకవర్గంలో 6 మండలాల్లో మొత్తం 416 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 26,613 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నియోజవర్గ వ్యాప్తంగా 1,368 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. దాదాపు 70 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండటంతో విద్యాబోధన ముందుకు సాగడం లేదు. కదిరి మున్సిపల్ ఉర్దూ మెయిన్ ఉన్నత పాఠశాలలో ఏడుగురు ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట నలుగురే పని చేస్తున్నారు. మున్సిపల్ యాజమాన్యం ఈ పాఠశాలను 2013లో బైఫర్‌గేషన్ చేసినా శాంక్షన్ పోస్టులు ఒకటీ ఇవ్వలేదు. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు పాఠశాలను అప్పగించాక వేరే పాఠశాలల నుంచి వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ముగ్గురు ఉపాధ్యాయులు, ఒక హెచ్ఎంను నియమించారు. ఇక మధ్యాహ్న భోజన ఏజెన్సీలను మార్చడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టింది. విద్యార్థులకు విద్యాసామగ్రితోపాటు మధ్యాహ్న భోజనం, చిక్కీలు, ఐఎఫ్‌పీ ద్వారా విద్యాబోధన అమలు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యం వహిస్తుడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు.

మధ్యాహ్న భోజనానికి విద్యార్థుల ఇబ్బందులు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న పలు ప్రభుత్వ బడుల్లో గతంలో ఉన్న మధ్యాహ్న భోజన ఏజెన్సీలను వైఎస్సార్‌సీపీకి చెందిన వారని తప్పించారు. అయితే వెంటనే కొత్త ఏజెన్సీలను ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వం వర్గపోరుతో సతమతమవుతోంది. అన్ని గ్రామాల్లోనూ కూటమికి చెందిన నాయకులు వర్గాలుగా ఉండటంతో తమ వారికే ఏజెన్సీ ఇవ్వాలంటూ భీష్మించుకు కూర్చున్నారు. దీంతో పాతవారిని తొలగించడం, కొత్తవారిని నియమించకపోవడం విద్యార్థులను, ఉపాధ్యాయ సిబ్బందిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది.

– దొడ్డెప్ప, మాజీ ఎస్ఎంసీ చైర్మన్, అమడగూరు

రెగ్యులర్ పోస్టు ఒక్కటీ లేదు



మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో రెగ్యులర్ టీచర్లు ఒక్కరూ లేకపోవడం దారుణం. వేర్వేరు పాఠశాలల నుంచి అరకొర ఉపాధ్యాయులను నియమిస్తే చదువులు ఎలా సాగుతాయి. అరకొర ఉపాధ్యాయులను నియమించి విద్యాశాఖ చేతులు దులుపుకుంటోంది. ఉర్దూ ఉన్నత పాఠశాలకు పూర్తి స్థాయిలో టీచర్లను నియమించాలి. లేకుంటే భవిష్యత్తులో ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– వల్లా చంద్రశేఖర్, కదిరి

■ **అడుగడుగునా అడ్డంకులు**

గత ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినా కూటమి నాయకులు కోర్టులకు వెళ్లి పోస్టులను భర్తీ చేయకుండా అడ్డుకున్నారు. దీనికితోడు ప్రభుత్వం సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయులను బదిలీ చేసింది. అయినా కూటమి నాయకులు ఉపాధ్యాయులు విధుల్లో చేరకుండా అడ్డుకున్నారు. ఫలితంగా ఉపాధ్యాయుల కొరతతో బోధనకు ఆటంకంగా మారింది.

టీచర్లను వెంటనే నియమించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో విద్యార్థులు పాఠ్యాంశాలు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు లేరు. మరో నెలల క్వార్టర్లీ పరీక్షలు జరగనున్నాయి. అధికారులు వెంటనే స్పందించాలి.

–సీ.సాయినాథ్‌రెడ్డి, దాడితోట, తాడిమర్రి.

పాతరోజులు పునరావృతం



టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలకు తిరిగి పాత రోజుల పరిస్థితి వచ్చింది. పేద పిల్లలకు ఇంగ్లిష్ చదువులు తీసుకొచ్చారు. అయితే ప్రస్తుత సర్కారు పాలనలో ప్రభుత్వ పాఠశాలలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

– చెడిపోతుల గోపాల్, రాఘవంపల్లి, బత్తలపల్లి మండలం

తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం



స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నాం. 420 మంది విద్యార్థులున్న పాఠశాలలో 15 రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా చేస్తున్నారు. నీటిని సంపులోకి వదులుతుండటంతో పురుగులు పడుతున్నాయి. ఆ నీటితోనే మధ్యాహ్న భోజనానికి, విద్యార్థులు తాగడానికి ఉపయోగిస్తారు.

– సాయి గణేష్, ముదిగుబ్బ, విద్యార్థి

ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బంది



మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో రెండు, మూడు సెక్షన్లను కలుపుకుని ఒకే ఉపాధ్యాయుడు పాఠాలు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. జీఓ 117ను రద్దు చేసి ఉపాధ్యాయులను త్వరితగతిన నియమించాలి.

– హరికృష్ణ, యూటీఎఫ్ పట్టణాధ్యక్షుడు, ధర్మవరం

క్లుప్తంగా

వైద్య శిబిరం


ముఖ్య అతిథులను సన్మానిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేశవనగర్‌లో నున్న మెహర్ వైట్ హౌస్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 60 మంది రోగులకు ఈసీజీ, 2డీఎకో వైద్య పరీక్షలను ఉచితంగా చేసినట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ ఛైర్మన్ పోలా ప్రభాకర్ తెలిపారు. గుండె జబ్బులు, బీపీ, పక్షవాతం, మూర్ఛ, మెడ నొప్పి, నడుమునొప్పి, సయాటికా, చేతులు, పాదాలు తిమ్మిర్లు, నరాల బలహీనత, మూతి వంకర తదితర లక్షణాలున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. పట్టణ ప్రముఖులు గుద్దిటి సోమదాసు, డాక్టర్లు రవిప్రకాష్, సుభాష్ చంద్రబోస్‌లను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు శీలా నాగేంద్ర, జయరాం, బండి నాగేంద్ర, క్యాంపు ఛైర్మన్ సత్యనిర్ధారణ్, డాక్టర్ సుబ్బారావు, చాంద్‌బాషా, రామంజనేయులు, వంకదారి మోహన్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విలేకరి మృతి


బాబు(ఫైల్)

కదిరి టౌన్: పట్టణంలో ఓ దినపత్రిక విలేకరి పనిచేస్తున్న మహబూబ్ బాషా ఆలియాస్ బాబు(41) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం. విలేకరి మృతిపై ప్రజాసంఘాల నాయకులు, పాత్రికేయులు సంతాపం తెలియజేశారు.

యానిమేటర్‌ను మార్చొద్దు


బుక్కపట్నం శివాలయంలో సమావేశమైన పొదుపు మహిళలు

పుట్టపర్తి: యానిమేటర్‌ను మార్చొద్దని వెంటేశ్వర గ్రామైక్య సంఘం మహిళలు అధికారులను కోరారు. ఆదివారం 350 మంది పొదుపు మహిళలు బుక్కపట్నం తేరు కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించారు. అనంతరం శివాలయంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యానిమేటర్‌గా పురుషులు వద్దని, గతంలో మహిళలు బాగా పని చేశారన్నారు. 2019కు ముందు పని చేసిన ఓ పురుష యానిమేటర్ తమను అన్నిరకాలుగా ఇబ్బందులకు గురి చేశాడని వారు గుర్తు చేశారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివ నాగప్రసాద్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు.

నడిమిగడ్డపల్లి తండాలో తాగునీటికి కటకట


తాగునీటి కోసం ట్యాంకర్‌ను చుట్టుముట్టిన తండా వాసులు

ధర్మవరం రూరల్: నడిమిగడ్డపల్లి తూర్పు తండాలో తాగునీటికి తండా వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రక్షిత తాగునీటి పథకం మోటరు పని చేయకపోవడంతో తండా వాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తాగునీటి అవసరాల కోసం పంచాయతీకి నిధులు కేటాయించకపోవడంతో ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలుస్తోంది. మహిళలు పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే వుంటు వాటర్ ట్యాంక్ ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని తండా వాసులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో జలధి

ఎన్‌పీకుంట: జౌకల గ్రామంలో మొహర్రంలో భాగంగా ఆదివారం పీర్ల జలధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముజావర్లు పీర్లను వివిధ రకాల పూలసేరాలతో ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పీర్లస్వాములకు చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు. ఇదిలా ఉండగా పీర్ల పండుగ నిర్వహణకు మండల కేంద్రానికి చెందిన బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబ్జాన్ రూ.15 వేలు విరాళం అందించారు.

కంటి ఆరోగ్యంపై దృష్టి సారించాలి


కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న యువర్స్‌ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై దృష్టి సారించాలని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు కంటిచూపు తగ్గిన 80 మందివృద్ధులకు కంటి పరీక్షలను చేసి 50 మందిని ఆపరేషన్లకు ఎంపికచేశారు. వారందరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని యువర్స్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. యువర్స్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సుకుమార్, సహాయ కార్యదర్శి నాగార్జున, పీఆర్‌ఓ రాధాకృష్ణ, క్యాంపు ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులు చాంద్‌బాషా, డాక్టర్ సుబ్బారావు, స్టార్ ఖలీల్, సత్రసాల మల్లికార్జున, రమేష్‌బాబు, రామంజి, పల్లా లక్ష్మీనారాయణ, చింతా శ్రీనివాసులు, పోలా ప్రభాకర్, బండ్లపల్లి రంగనాథ్, వైకే శ్రీనివాసులు, కోటేశ్వరరావు, ఓవీప్రసాద్, రంగన కుమారస్వామి, రామచంద్రగుప్త, రంగన వెంకటేష్, రంగం ఆది, ఆదిశేషు, ఊకా సతీష్, మామిళ్ల ప్రసాద్, జయంతి వినోద్, పామిశెట్టి లక్ష్మినారాయణ, నామాల శ్రీనివాసులు, వాసుదేవుడు, శివప్రసాద్, ఆప్తమాలజీ టెక్నీషియన్ నాగరాజాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే


ఫ్రెండ్‌షిప్ వేడుకలు చేసుకుంటున్న స్నేహితులు

బత్తలపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బత్తలపల్లిలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాఠశాలకు సెలవు అయినప్పటికి పాఠశాలకు వచ్చి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉపాధ్యాయులకు స్వీట్లు పంచారు. విద్యార్థులు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టుకున్నారు. పదో తరగతి పూర్వవిద్యార్థులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కేరళలోని వయనాడ్ వరద బాధితులకు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా పంపారు.

గుత్త డబ్బు చెల్లించండి

తలుపుల: ఓబుళేశ్వరస్వామి మాన్యం భూముల గుత్త డబ్బు చెల్లించాలని ఈఓ రవీంద్రరాజు ఆదివారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. మాన్యం భూములు సర్వే నెంబర్ 901లో గల 66 ఎకరాల భూమిని సి.పాపులమ్మ దక్కించుకున్నారని, ఏటా డబ్బు చెల్లించాల్సి ఉండగా రెండో ఏడాది గడువు దాటినా డబ్బు చెల్లించలేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా దీనిపై ఇరువర్గాలు పోలీసులను సంప్రదించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు నడుచుకోవాలని ఎస్‌ఐ దిలీప్‌కుమార్ వారికి సూచించారు.

10న జిల్లాస్థాయి టీచర్స్ చెస్ టోర్నీ


మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో ఈనెల 10న జిల్లాస్థాయి టీచర్స్ చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి టీచర్స్ చెస్ టోర్నీని నిర్వహిస్తున్నామన్నారు. టోర్నమెంట్‌కు కన్వీనర్‌గా రామకృష్ణనాయక్, శివకృష్ణలు వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జట్లు పోటీల్లో పాల్గొంటాయని, ప్రభుత్వ ఉపాధ్యాయులకు మాత్రమే టోర్నీ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలో పాల్గొనే ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు తమ సొంత చెస్ కిట్టుతో హాజరు కావాలని, ఆసక్తిగల ఉపాధ్యాయులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. యూటీఎఫ్ జోన్ నాయకులు జయసింహ, హనుమంతరావు, ఆంజనేయులు, లక్ష్మయ్య, సకల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి దేవికి బోనాలు


ఎన్‌పీకుంటలో చౌడేశ్వరీదేవికి బోనాలు తీసుకెళుతున్న మహిళలు


ధర్మవరంలో చౌడేశ్వరిమాతకు బోనాలు తీసుకొచ్చిన పార్థసారథినగర్ మహిళల

ధర్మవరం అర్బన్: చౌడేశ్వరిదేవి జయంతి సందర్భంగా పార్థసారథినగర్‌లో ఆదివారం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు, చిన్నారులు తలపై బోనాలు పెట్టుకుని వార్డులో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కదిరి టౌన్: స్థానిక వాల్మీకి పాఠశాల సమీపంలో ఉన్న చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి వివిధ అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు.

ఎన్‌పీకుంట: తొగటవీర క్షత్రీయుల కులదేవత చౌడేశ్వరీదేవి అమ్మవారి జయంతి ఉత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. ఏటా ఆషాఢ మాసం అమావాస్య రోజు అమ్మవారి జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు సోమిరెడ్డి, దండే గంగశేఖర్, రెడ్డప్ప తెలిపారు. మండల కేంద్రంతో పాటు పి.కొత్తపల్లి, టీ.ఎస్.పల్లిలోని అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

తాడిమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలోని పెద్దమ్మ తల్లి, పెద్దకోట్ల చౌడేశ్వరి ఆలయం, కునుకుంట్లలోని ఓసూరమ్మ, యల్లమ్మ, పెద్దమ్మ ఆలయాలు, దాడితోటలోని బాట్ల సుంకలమ్మ, గంగమ్మ తల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

తనకల్లు: మండల కేంద్రంలో చౌడేశ్వరీ దేవి జయంతి వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తాదులకు దర్శనమిచ్చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. దేశాయి కరుణాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, భక్తవత్సలరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: న్యామద్దెల, మేడాపురం గ్రామాల్లో దేవాంగుల ఆరాధ్యదైవమైన చౌడేశ్వరీ దేవి జయంతిని ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తొలుత చౌడేశ్వరీ దేవి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూల విరాట్‌ను ఆభరణాలు, పుష్పాలతో ప్రత్యేంగా అలంకరించి పూజలు చేపట్టారు.

బత్తలపల్లి: స్థానిక వడ్డెర కాలనీలో వెలసిన పెద్దమ్మ, లక్ష్మీదేవాలయం, బళ్లారి దుర్గమ్మ, కొల్లాపురమ్మ, పోట్లమర్రి ఆంజనేయస్వామి, మల్లేశ్వర స్వామి, ముష్టూరు ఆంజనేయస్వామి, శివాలయంలోనూ, గంటాపురం అప్పస్వామి ఆలయంలోనూ పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం నుంచి శ్రావణమాసం పూజలు చేపట్టనున్నారు.

డంపింగ్ యార్డుతో అవస్థలు


మల్లేనిపల్లి వద్ద ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డు నుంచి వెలువడతున్న పొగ

ధర్మవరం: మల్లేనిపల్లి గ్రామ సమీపంలో ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డుతో పరిసర ప్రాంతాల గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డంపింగ్ యార్డులోని చెత్తకు నిప్పు పెడుతుండటంతో దట్టమైన పొగ అలముకుని గ్రామాలకు వ్యాపిస్తోంది. ఈ పొగను పీల్చడం వలన సమీపంలోని మల్లేనిపల్లి, రావులచెరువు, ఆకుతోటపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ పొగ వారాల తరబడి వస్తుండటంతో కాలుష్యం కారణంగా శ్వాస కోశ వ్యాధుల బారిన పడుతున్నామని మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.